ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

మంగళవారం 22 జూలై 2025

పరిహారం చెల్లించేదెప్పుడో..?



- ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వాసితుల బాధలు వర్ణనాతీతం
- భూములు కోల్పోయిన రైతులను పట్టించుకోని ప్రభుత్వాలు
- ఏళ్లుగా తప్పని ఎదురు చూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

మంచిర్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుడిపేట వద్ద గోదావరి నదిపై నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యలు దశాబ్దాలు గడుస్తున్నా తీరడం లేదు. 2004 జూలై 28వ తేదీన అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. నత్తనడకన సాగిన పనుల కారణంగా మూడేళ్లల్లో పూర్తి కావలసిన ప్రాజెక్టు నిర్మాణం 12 ఏళ్ల సుదీర్ఘ కాలం తరువాత 2015లో పూర్తయింది. అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా నడుమ గోదావరిపై ఎల్లంపల్లిప్రాజెక్టును నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం 2004లో సుమారు రూ. 6 వందల కోట్లు కేటాయించింది. 20.175 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఆనకట్ట నిర్మాణానికి రూ.408.85కోట్లు కేటాయించగా గేట్ల నిర్మాణానికి సుమారు రూ.191కోట్లు కేటాయించారు. మంచిర్యాల వైపున మట్టికట్ట పొడవు 2.10కిలోమీటర్లు, ఎల్లంపల్లి వైపున పొడవు 2.30కి కిలోమీటర్లు నిర్మించారు. ఆనకట్ట పొడవు 1.118 కిలో మీటర్లు కాగా 62గేట్లు ఏర్పాటు చేశారు. మంచిర్యాలజిల్లా హాజీపూర్ మండలంలో ఏడు గ్రామాలు, లక్షెట్టిపేట మండలంలో రెండు గ్రామాలు ముంపునకు గురవు తుండటంతో ప్రజల కోసం పునరావాస ఏర్పాట్లు చేశారు.

పరిహారం కోసం ఎదురు చూపులు...

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కింద మంచిర్యాల జిల్లాలోని తొమ్మిది గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. హాజీపూర్ మండలంలోని గుడిపేట, నంనూర్, చందనాపూర్, రాపల్లి, కొండపల్లి, కర్ణమామిడి, పడ్తనపల్లి గ్రామాలతో పాటు లక్షెట్టిపేట మండలంలోని గుళ్లకోట, సూరారం గ్రామాలను ముంపు కింద ఎంపిక చేశారు. హాజీపూర్ మండలం లోని చందనాపూర్ గ్రామానికి సంబంధించి మొత్తం 183 నివాస గృహాలు ఉండగా వీరికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదు. మేజర్‌సన్స్, ఇతర చెల్లింపులను చేయలేదు. అలాగే కొండపల్లి గ్రామంలో మొత్తం 253 నివాస గృహాలుం డగా ఎఫ్ఆర్ఎల్ కింద సుమారు 90 నివాస గృహాలున్నాయి. కర్ణమామిడిలో 176 ఎఫ్ఆర్ఎల్ కింద నివాస గృహాలున్నాయి. పడ్తనపల్లిలో 30 ఎఫ్ఆర్ఎల్ కింద నివాస గృహాలున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి దశాబ్ద కాలం గడుస్తున్నప్పటికీ పరిహారం చెల్లించలేదని నిర్వాసితులు వాపోతున్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇండ్లు త్యాగం చేసినప్పటికీ అధికారులు, ప్రభుత్వం పరిహారం చెల్లించడంలో విఫలమయ్యారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

చెల్లింపుల్లో జాప్యం....

ఎల్లంపల్లి ముంపు బాధితుల కోసం పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి, అప్పటి ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల...

- మిగతా 7లో

ఇందిరమ్మ ఇల్లు, డబ్బులు ఇస్తలేరు...

ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపులో ఇల్లు, ఇంటి స్థలం కోల్పోయాను. ఆర్అండ్ఆర్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కింద మరో రూ. 70వేలు చెల్లిస్తా మని ప్రకటించారు. సంవత్సరాలు గడిచినా ఎవరూ స్పందించ డంలేదు. ప్రాజెక్టు నిర్మించిన కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రస్తుతం అధికారంలో ఉన్నందున వెంటనే పరిహారం చెల్లించాలి.



- లగిశెట్టి రాజమౌళి, గుడిపేట

మేజర్ సన్ పరిహారం నేటికీ అందలేదు....

ప్రాజెక్టు ముంపు బాధితులు 18 ఏళ్ల నిండిన వారి కి మేజర్ సన్స్ స్కీం కింద రూ. 2 లక్షలు పరిహారం చెల్లించాల్సి ఉంది. మేజర్ సన్ స్కీం కింద నాకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నాయి. ఈ విషయమై ఇప్పటికి అనేకమార్లు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధు లు స్పందించి పరిహారం చెల్లించాలి.



- సంగెం అభిలాష్, గుడిపేట

కారోబార్లకు మల్టీపర్పస్ కష్టాలు

- జీవో51తో ఉనికిని కోల్పోతున్న జీపీ సిబ్బంది
- సకాలంలో అందని వేతనాలు
- రికార్డులు రాసిన చేతితో పారిశుధ్య పనులు
- పాత పద్ధతినే కొనసాగించాలని వేడుకోలు

6

విద్యుత్ ఉద్యోగులకు భరోసా..



- అందుబాటులోకి బీమా పథకం
- విధి నిర్వహణలో మృతి చెందితే కోటి పరిహారం
- తీవ్రంగా గాయపడితే రూ.80లక్షలు
- సహజమరణం చెందితే రూ.10లక్షలు

7

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం



నియామకపత్రం అందజేస్తున్న ఫొటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలక్రైం, జూలై21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం జన్మభూమినగర్ రాంచెరువు పోచమ్మ వద్ద ఎలక్షన్ కమిటీ రాష్ట్ర ముఖ్య సలహాదారుడు కేదార్‌రెడ్డి, ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్ను కున్నారు. అధ్యక్షుడిగా అప్పాసు రాము, ప్రధాన కార్యదర్శిగా పోతరవేని తిరుపతి, కోశాధికారిగా ముక్కెర శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహేశ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చందు, భూ మన్న, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనకయ్య గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న గల్ఫ్ అసోసియేషన్

జన్నారం, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాగూడ గ్రామానికి గల్ఫ్ బాధితుడు బత్తుల సత్తన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి గల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ.50100 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్అసోసియేషన్ సభ్యులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన బోట్ల ఇందూర్ అనారోగ్యంతో ఐదు రోజుల క్రితం మృతి చెందాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం వారి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.4వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గూడెం మాజీ ఎంపిటిసిలు తోట మోహన్, ముత్తె నారా యణ, నాయకులు చంచు నగేష్, తిరుపతి శంకరయ్య, లక్ష్మణ్, చంద్రయ్య, రాజయ్య, నర్సయ్యలు పాల్గొన్నారు.

సీఎంతో సమావేశంలో పాల్గొన్న మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం, మంత్రి

చెన్నూరు/మందమర్రిటౌన్ జూలై21 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి వివేక్‌వెంకట స్వామిలు కార్మికశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో మొత్తం 111 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఏటీసీల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అవసరమైతే నైపుణ్యంగల నిర్మాణ సంస్థలను నియమించవచ్చని తెలిపారు. జీనోమ్‌వ్యాలీలో ఒక నమూనా ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. టీజీ గిగ్ వర్కర్ల పాలసీ ద్వారా గిగ్‌వర్కర్లకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలన్న ప్రతిపాదన ఉందని, ఈ పాలసీలో భాగంగా ప్రభుత్వం ప్రతినిధులతో కూడిన వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామన్నారు. గిగ్‌వర్కర్లకోసం వెల్ఫేర్‌ఫండ్‌ను ఏర్పాటుచేసి ప్రమాద బీమా, ఆరోగ్య బీమావంటి సదుపాయాలను కల్పించాలని సూచించారు.

- కాంగ్రెస్‌పార్టీ జాతీయఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సోమవారం మంత్రి వివేక్‌వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు మర్యాద పూర్వ కంగా కలిశారు. ఆయన పుట్టినరోజు కావడంతో ఖర్గేకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



విద్యార్థులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. పట్టణం లోని సాయికుంటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం ఆశ్రమ పాఠశాలలో పురుగుల అన్నంతినడంతో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్నారు. కనీసం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం ఏంటని పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్య, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

విద్యార్థినిని పరామర్శించిన బీజేపీ నాయకులు



ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

మందమర్రిటౌన్, జూలై21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నార్లాపూర్‌కు చెందిన అనారోగ్యంతో బాధపడుతూ మంచిర్యాల మాతాశిశు కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థిని బీజేపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిదుర్గం అశోక్ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలి పారు. మంచిర్యాలలోని ఓ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువు తన్న విద్యార్థి మూడురోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆశ్రమపాఠశాల నిర్వాహకులను అడిగామన్నారు. నిర్వాహకులు విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం పట్లశ్రద చూపాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు డివిజన్ అధ్యక్షులు అమిర్‌శెట్టి రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు, రాష్ట్ర నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటకృష్ణ ఉన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

జన్నారం, జూలై21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్దు బాటు పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే వాటిని అతిక్రమించి తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకంటే ఉపాధ్యాయుల ప్రయోజనాలే దృష్టిలో పెట్టుకొని సర్దుబాటు చేశారన్నారు.

వెంటనే కలెక్టర్ స్పందించి విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భారీ వాహనాలకు అనుమతులివ్వాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

జన్నారం, జూలై21 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం, దండేపల్లి, నిర్మల్ జిల్లా కడెం మండలాల మీదుగా భారీ వాహనాలను అనుమతించాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన రిలేనిరహార దీక్ష 5వ రోజుకు చేరింది. ఈ దీక్షకు మండల బీఆర్ఎస్ శ్రేణులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రాజారాంరెడ్డి, జనార్ధన్ మాట్లాడుతూ టైగర్‌జోన్ పేరిట మండలాల అభివృద్ధిని ఆపడం సరికాదన్నారు.

వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారీ వాహనాలన్నింటికీ అభివృద్ధికి తోడ్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలసాని శ్రీనివాస్, సిటిమల్ల భరత్ కుమార్, జక్కు భూమేశ్, సుతారి వినయ్‌లు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న సీఐ, పోలీసులు

బెల్లంపల్లి, జూలై21 (ఆంధ్రజ్యోతి): ఎవరైన చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవనిమాల గురిజాల సీఐ అనుక్ అన్నారు. సోమవారం మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో ఎక్సయిజ్ అధికారులతో కలిసి కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించి మాట్లాడారు. ఎవరైన గుడుంబాను తయారు చేసిన విక్రయించిన చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. గుడుంబా సేవించడం వలన అనారోగ్యాల భారినపడి మృత్యువాత పడతారన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు లోనుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన ఉందన్నారు.

ఏదైన సమస్య ఉంటే డయల్100కు సమచారం అందించాలని సూచించారు. 31 ద్విచక్రవాహనాలు, మూడు ఆటోలకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. నాయినిలచ్చయ్య, మలోతు అనే వ్యక్తులవద్ద నుంచి 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్, కన్నెపల్లి ఎస్ఐభాస్కర్, భీమిని ఎస్ఐ విజయ్, బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్ఐరాకేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అ'ధర'హో

- కిలో 350 పలుకుతున్న బోడకాకరకాయ



బోడ కాకర కాయలు

దండేపల్లి జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఔషధ గుణాలున్న అడవి (బోడ) కాకరకాయ ధర ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ. 350 పలుకుతోంది. మార్కెట్‌లో అప్పడప్పుడు కనిపించే అడవి కాకర కాయలు చాలా మందికి తెలియదు. ప్రస్తుతం బోడకాకర సీజన్ ప్రారంభం కావడంతో వాటికి డి మాండ్ పెరిగింది. అయితే సీజన్‌లో మాత్రమే దొరకడం, అత్యంత రుచిగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి కూడా మంచిది కావడంతో చాలా మంది ధరకు వెను కాడకుండా కొంటుంటారు. ఇవి ఎక్కువగా అటవీ ప్రాంతంలోనే పండుతాయి. వర్షాకాలంలో మొదలయ్యే జలుబు, దగ్గు, తుమ్ముల నుంచి రక్షిస్తుంది. కొద్ది రోజుల క్రితం కిలోకు 200 ఉన్న వీటి ధర ప్రస్తుతం 300 నుంచి 350 వరకు ధర పలుకుతోంది.

ప్రైవేటు బడి వద్దని.. సర్కారు బడే ముద్దని

- ఉపాధ్యాయుల సమష్టి కృషి
- ముందస్తు బడిబాటతో సత్ఫలితాలు
- 36 నుంచి 90మందికి చేరిన విద్యార్థుల సంఖ్య



తాళ్లపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు(ఫైల్)



తాళ్లపేట ప్రభుత్వ పాఠశాల గదిలో విద్యార్థులు(ఫైల్)

దండేపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా.. ఏ ఏడాదికి ఆ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంతో కొంత తగ్గుతోంది కానీ పెరగదు. ఇది అందరికి తెలిసిన విషయమే.. ప్రభుత్వ పాఠశాలలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ పిల్లల తల్లిదండ్రులు మాత్రం ప్రైవేటు మోజులో పడి వారి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకే పంపిస్తున్నారు. కానీ మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అందుకు విభిన్నంగా ఉంది. గత ఏడాది 55 మంది విద్యార్థులు ఉండగా, అందులో 11 మంది 5వ తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతి చేరేందుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరారు. అందులో గురుకులాలు, నవోదయ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు కలుపుకొని మరో 8 మంది మొత్తం 19 మంది విద్యార్థులు బడి నుంచి వెళ్లిపోవడంతో విద్యార్థుల సంఖ్య 36కి పడిపోయింది.

బడిని బతికించింది.. ఈముగ్గురు ఉపాధ్యాయులే

ఇదే పాఠశాలలోని విధులు నిర్వహిస్తున్న పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు జగదీశ్వర్‌గౌడ్ గత నెలలో ఉద్యోగ పదవి విరమణ పొందారు. దీంతో ఇదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బానవత్ ప్రభాకర్‌కు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు ఇచ్చారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులు పోల్లంపల్లి శ్రీనివాస్, పోల్లంపల్లి రామరాజులు ఈ ముగ్గురు బడిని బతికించుకోవాలని నిర్ణయించుకొని వారి సమిష్టి కృషితో ముందస్తు బడిబాట క్యాక్రమం ద్వారా గ్రామంలో ఇంటింటా తిరిగి మరో 54 మంది విద్యార్థులు పాఠశాలలో చేర్పించుకోగా ప్రస్తుతం పాఠశాలలోని 90 మంది విద్యార్థుల సంఖ్య చేరుకుంది.

బడిబాటతో 54 మంది విద్యార్థుల కొత్త అడ్మిషన్

తాళ్లపేట ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో 1వ తరతగతి నుంచి 5వతరగతి వరకు కేవలం 36మంది మాత్రమే ఉండేది. ఈనేపధ్యంలో పాఠశాలలో చదువు చెప్పే ఉపాధ్యాయులు ప్రభాకర్, శ్రీనివాస్, రామరాజులు బడిని బతికించాలనే ఉద్దేశంతో ముగ్గురు ఒకటై గ్రామంలో ఇంటింటి తిరుగుతూ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్, రుచికరమైన భోజనంతో పాటు పాఠశాలలో మెరుగైన వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తూ సర్కార్ బడిలోనే నాణ్యమైన విద్యా బోధన అందుతుందని చెప్పి బడిబాట కార్యక్రమంలో మీ పిల్లలను సర్కార్ బడికి పంపించాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలకు వద్దు సర్కార్ బడియే ముద్దని 54 మంది పిల్లలను బడిలో చేర్పించుకున్నారు. విద్యార్థులతో ఇప్పుడు తాళ్లపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కళకళలాడుతోంది. దీంతో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల కృషి ఎనలేని దన్నారు. గ్రామస్థులు ఉపాధ్యాయులను అభినందించారు.

ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినుల అస్వస్థత

ఆస్పత్రిలో చేర్పించిన తల్లిదండ్రులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏసీపీకి ఫిర్యాదు

మంచిర్యాలక్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న భైరి తరుణి, రేవతి అనే విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో సోమవారం అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలియడంతో వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని వారిని ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. విద్యార్థుల తలిదండ్రులు జ్యోతి, లక్ష్మణ్ తెలిపిన వివరాల మేరకు మందమర్రి మండలం నార్లపూర్‌కు చెందిన తరుణి, రేవతి అక్కాచెల్లెళ్లు. తరుణి 8వ తరగతి, రేవతి 6వ తరగతి చదువుతోంది. పాఠశాలలో సరైన ఆహారం తీసుకోకపోవడంతో బుధవారం నుంచే వీరిద్దరూ వాంతులు చేసుకుంటున్నారు. గురువారం అస్వస్థతకు గురై జ్వరం వచ్చినా పిల్లల తల్లిదండ్రులకు వార్డెన్ సమాచారం అందించలేదు. జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి పిల్లలకు జ్వరం వస్తోందని ఇంటికి తీసుకెళ్లాలని సూచించడంతో విద్యార్థుల తండ్రి ఆదివారం రాత్రి పాఠశాలకు చేరుకుని వారిని ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే పరిస్థితి విషమించి విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో హుటాహుటిన వారిని అదే రాత్రి మంచిర్యాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్‌ల నిర్లక్ష్యం వల్లనే తమ పిల్లలకు ఇలాంటి గతి పట్టిందని, విద్యార్థులు మూడు రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నా తమకు సమాచారం ఇవ్వకపోవడం ఏంటని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంచిర్యాల ఏసీపీకి విద్యారుల తల్లిదండ్రులు సోమవారం ఫిర్యాదు చేశారు.



చికిత్సపొందుతున్న తరుణి



చికిత్స పొందుతున్న రేవతి

విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉంది..

కలెక్టర్ కుమార్ దీపక్

గిరిజన బాలికల వసతి గృహంలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రేవతి, తరుణి టాన్సిలైటిస్ జ్వరంతో బాధపడుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి వెంట ఉండి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కలుషిత ఆహారం తినడం వల్ల అలా జరిగిందని కొందరు ప్రచారం చేసి గందరగోళం సృష్టిస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

కొండాపటార్‌లో పాము కాటుతో వివాహిత మృతి

జైనూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుగూడ పంచాయతీ పరిధిలో గల కొండాపటార్ గ్రామానికి చెందిన కొలాం ఆదివాసీ వివాహిత సిడాం కన్నిబాయి(44) సోమవారం తెల్లవారుజామున పాము కాటుతో మృతి చెందిందని బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. సిడాం కన్నిబాయి రాత్రి నిద్రిస్తుండగా పాటు కాటు వేసింది. ఆమె కేకలు వేయడంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన జైనూర్ పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీ సిబ్బంది పరిశీలించారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని ఉట్నూరు సివిల్ ఆసుపత్రికి తరలించాలని సూచిచారు. అక్కడి వైద్యులు పరిశీలించారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి విష మించడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కి తరలించాలని వైద్యులు సూచిం చారు. కన్నిబాయిని ఆదిలాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుంటుబ సభ్యులను మాజీ సర్పంచ్ మేస్రాం సార్జబాయి శంకర్, కొలాం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం రాజు తదితరులు పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఐటీడీఏ ద్వారా ఆదుకోవాలని, జైనూర్ పీహెచ్‌సీలో పాము కాటుకు మందులు అందుబాటులో ఉండేల చర్యలు తీసుకోవాలని ఆత్రం రాజు కోరారు..

కారోబార్లకు మల్టీపర్పస్ కష్టాలు



- జీవో51తో ఉనికిని కోల్పోతున్న జీపీ సిబ్బంది
- సకాలంలో అందని వేతనాలు
- రికార్డులు రాసిన చేతితో పారిశుధ్య పనులు
- పాత పద్ధతినే కొనసాగించాలని వేడుకోలు

కెరమెరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి పని చేస్తున్న కారోబార్‌లు గత ప్రభుత్వం నిర్వాహకం వల్ల ఏర్పడ్డ మల్టీపర్పస్ విధానంతో తమ ఉనికిని కోల్పోయే స్థితికి చేరుకున్నారు. పెన్ను, పేపర్ పట్టి గ్రామ పంచాయతీ రికార్డులు రాసి సిబ్బందితో పనులు చేయించే కారోబార్‌లు నేడు జీవో 51తో పార పట్టుకోవాల్సిన స్థితికి చేరుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయతీల్లో కారోబార్‌లు, బిల్ కలెక్టర్ సిబ్బంది కలిసి 59 వేల మంది పని చేస్తున్నారు. వారికి ఇచ్చేది కేవలం రూ.9,500 వేతనం మాత్రమే. ఆ వేతనాలు కూడా ప్రతి నెల రావు మూడు నాలుగు నెలలకోసారి వస్తాయి. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కారోబార్‌లు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారోబార్‌లు గ్రామ పంచాయతీల్లో గత కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. డిగ్రీలు, పీజీలు చేసి ఉన్నారు. దీంతో పారిశుధ్య పనుల నుంచి మినాహాయించి పంచాయతీ నిర్వహణ బాధ్యతలు అప్పగించే నిర్దేషిత జాబ్ చార్ట్‌ను కేటాయించాలని ప్రభుత్వాన్ని వేడుంటున్నారు. మల్టీపర్పస్ విధానం నుంచి విముక్తులను పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరుతున్నారు. ప్రతి నెల గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

చాలీచాలని వేతనాలతో..

నిత్యం ప్రజల మధ్య ఉండే కారోబార్‌లు చాలీచాలని వేతనాలతో గ్రామాల్లో ప్రజలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అందు బాటులో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజలకు గ్రామ, మండల స్థాయి అధికారులకు వారధిగా ఉంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 2019 వరకు 856 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 856 మంది కారోబార్‌లుగా పని చేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో 173 మంది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 173 మంది కారోబార్‌లుగా పని చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి గ్రామాలకు వచ్చే సరికి సిబ్బంది సమన్వయం చేస్తూ పారిశుధ్య పనులు చేయించడం, వీధి దీపాలు వేయించడం, డ్రైనేజీలతో పాటు శుభ, అశుభ కార్యక్రమాల వల్ల ఇంటి వద్ద పరిశుభ్రంగా ఉంచడం, పన్నులు వసూలు చేయడం, బోర్లు మోటారులు కాలిపోతే మరమ్మతులు చేయించడం, వీధి దీపాలు ఏర్పాటు చేయడం, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలోనూ వారి పాత్ర కీలకం. అయితే ప్రభుత్వం మల్టీపర్పస్ విధానంతో అన్ని పనులు వారే చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగికి లేని నిబంధనలను వారికి వర్తింపజేయడంతో కారోబార్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సంవత్సరాల తరబడి పని చేస్తూ బతుకీడ్చడం వారికి దుర్భరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాతీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కారోబార్లు కోరుతున్నారు.

జీవో 51ని రద్దు చేయాలి..

మామిడాల నర్సింహులు, గ్రామ పంచాయతీ జేఏసీ చైర్మన్



ప్రభుత్వం జీవో 51ని రద్దు చేయాలి. అందులో నుంచి కారోబార్‌లను మినహాయించి పాత పద్ధతిని కొనసాగించాలి. ఎవరు పనులు వారే చేసుకొనేలా వెంటనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. కారోబార్‌కు వర్క్ చార్ట్ అందించాలి. సిబ్బందికి ప్రతి నెలా గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

ఎస్పీఎం యాజమాన్యం తీరు సరికాదు

కాగజ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎస్పీఎం యాజమాన్యం వ్యవహించే తీరు సరికాదని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ పొన్న రమేశ్ అన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికులనే ఉద్యోగాలివ్వాలని ప్రధాన డిమాండుతో మంగళవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పొన్న రమేశ్ తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం పునరుద్ధరణ కోసం అనేక రాయితీలిచ్చినట్లు గుర్తు చేశారు. అయినా ఇక్కడి వారికి ఉద్యోగాలివ్వకుండా యాజమాన్యం తీరు సరికాదని చెప్పారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఉదయ్ పరిహ్యా (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్‌కు చెందిన పరిహ్యా గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన జట్టు

కౌటాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కౌటాల పోలీసు స్టేషన్‌లో జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, డీఎస్పీ రామాంజనేయులు ఆదేశాల మేరకు సీఐ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. నిర్వహించారు. ఈ పోటీల్లో బోధంపల్లి జట్టు ప్రథమ బహుమతి, ముత్యంపేట జట్టు ద్వితీయ బుమతి సాధించాయి. డీఎస్పీ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

సేవా సమితి అభివృద్ధికి చర్యలు

కెరమెరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాయిసెంటర్ రాజ్‌గోండ్ సేవా సమితి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అధ్యక్షుడు మోతీరాం అన్నారు. మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జాలీంషా, రాము, ప్రధాన కార్యదర్శిగా తుకారాం, కార్యదర్శిగా ధర్ము, కోశాధికారులుగా లింబరావు, సురేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చందన్‌షావు, లింగు, బొజ్జిరావు, రఘునాథ్‌రావు, సోము తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన సేవా సమితి మండల కమిటీ సభ్యులు

వెన్నెల గ్రూపు షెడ్డు ధ్వంసం

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

జైపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరాక్రాంతి పథకంలో భాగంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వెన్నెల వీవో మహిళా సంఘం గ్రూపునకు చెందిన షెడ్డును ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని జైపూర్ వీవో అధ్యక్షురాలు మద్దుల సునీత, సభ్యులు పూన అంజలి, దీపికలు పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో వెన్నెల వీవో గ్రూపు అనేక సంవత్సరాలుగా ఐకేపీ (సెర్ప్) కార్యకలాపాల్లో పాల్గొంటూ ఆదర్శ గ్రూపుగా గుర్తింపు పొందిందన్నారు. సం ఘం కార్యకలాపాలను విస్తరించేందుకు స్థానిక సింగిల్ విండో కార్యాలయం సమీపంలో ప్రభుత్వ భూమిలో అప్పటి అధికారులు షెడ్డును వేసుకోవాలని సూచించడంతో తాత్కాలికంగా షెడ్డు నిర్మించామన్నారు. గోదావరిఖని ప్రాంతానికి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు షెడ్డు వద్దకు వచ్చి షెడ్డును ధ్వంసం చేశారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ భూమిఅని, అధికారుల సహకారంతో షెడ్డును ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలను కొనసాగిస్తున్నామన్నారు. షెడ్డును ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్షకాలంలో ప్రజల సంక్షేమం కోసం జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, గడ్డం వివేకానంద, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ప్రదాన కార్యదర్శి రామకృష్ణరావు, ఇతర ఉన్నతాదికారులతో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసుశాఖ, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. వర్షకాలం సీజన్‌లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులలో నీటి నిలువల స్థాయి వినియోగం వానాకాలం సీజన్‌లో వ్యవసాయసాగు, యూరియా నిల్వలు ఎరువుల కొరత లేకుండా సమకూర్చాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జనజీవనం ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా వర్షాల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గిరిజనులు అంటువ్యాధుల బారిన పడకుండా ఐటీడీఏ అదికారులు ముందస్తు చర్యల్లో బాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. విధులను అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలలో మండల కేంద్రాలలో అదికారికంగా రేషన్ కార్డులను పంపిణీ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్ల, ఏఎస్పీ చిత్తరంజన్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఉద్యోగుల బదిలీలను రద్దు చేయాలి

శ్రీరాంపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1, ఆర్‌జీ-2 ఏరియాల్లో పనిచేస్తున్న టీబీజీకేఎస్ నాయకులను మణుగూరు, ఇల్లందు ఏరి యాలకు చేసిన బదిలీలను వెంటనే రద్దు చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, ఉప ప్రధాన కార్యదర్శి జావిద్ పాషా, బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న కొమురయ్యలను రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి సింగరేణి యాజమాన్యం ఇతర ప్రాంతాలకు బదిలీ చేసిందన్నారు. రామ్మూర్తికి 13 నెలలు, కొమురయ్యకు 8 నెలల సర్వీసు మాత్రమే ఉందని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. చట్టాలను లెక్క చేయకుండా వ్యవహరించడం సరికాదన్నారు. ముగ్గురు ఉద్యో గుల బదిలీలను రద్దు చేయనిపక్షంలో సింగరేణివ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసుకోవాలి

శ్రీరాంపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తమ సీపీఆర్‌ఎంఎస్-ఎన్(నాన్ ఎగ్జిక్యూటివ్) మెడికల్ కార్డులు రెన్యూవల్ చేసుకోవాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెన్యూవల్ కోసం ఏటా నవంబరు నెలలో లైవ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉండగా, 621 మంది ఇంకా అందించలేదన్నారు. కార్డు రెన్యూవల్ చేసుకోలేకపోతే వైద్య సౌకర్యం అందదని, ఇబ్బందులకు గురికావాల్సి ఉం టుందన్నారు. గమనించి లైవ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆయన కోరారు.

డ్రైవర్లు భద్రతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయప్రసాద్

మందమర్రిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న వాహన డ్రైవర్లు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ ప్రసాద్, బెల్లంపల్లి రీజియన్‌సేఫ్టీ జీఎం రఘుకుమార్ అన్నారు. స్థానిక స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోమవారం ఈపీ ఆపరేటర్లు, ఎంవీ డ్రైవర్లకు రెండు రోజులు సేఫ్టీమేనేజ్‌మెంట్ ప్లాన్ అమలుకు సంబంధించిన శిక్షణ, రక్షణ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్స్, ఎంవీ డ్రైవర్స్ భద్రత ప్రమాణాలు పాటిస్తూ స్వీయ రక్షణతో జాగ్రత్తగా పని చేయాలని తెలిపారు. గనుల్లో ప్రమాదాల నివారణకు సంబంధించి సీఎంఆర్ 2017లోనిర్దేశించిన రెగ్యులేషన్ ప్రకారం సేఫ్టీ మేనేజ్‌మెట్ ప్లాన్ అమలు పరుచడంతో పాటు ఎస్ఎం పీ పాటించాల్సిందేనని చెప్పారు. వాహనాలకు సంబంధించి లోపాలు ఉంటే అధికారుల దృష్టికితీసుకొచ్చి సరి చేసుకోవా లని సూచించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి భూశంకరయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, వృత్తి శిక్షణ మేనేజర్ శంకర్, రక్షణాధికారి విజయ్ కుమార్, శిక్షకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలులేని సింగరేణి సంస్థే లక్ష్యంగా ఉద్యోగులు బాధ్యాతాయుతంగా పని చేయాలని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ్ ప్రసాద్ అన్నారు. స్థానిక జీవీటీవీసీలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వై జర్స్ స్ట్రక్చర్ ట్రైనింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షణ సూత్రాలను పాటిస్తూ విధుల నిర్వహించాలని సూచించారు. రీజియన్ సేఫ్టీజీఎం రఘుకుమార్ మా ట్లాడుతూ యాజమాన్యం రక్షణకే పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్మికులు ప్రమదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి భూశంక రయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, జీవీటీవీసీ మేనేజర్ శంకర్, వీటీసీ శిక్షకుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

బొగ్గు గనుల రక్షణకు 24 నుంచి ఉద్యమం

- బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

శ్రీరాంపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనులు, కార్మికుల రక్షణకు తమ యూనియన్ ఉద్యమిస్తుందని బీఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి అన్నారు. యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ నుంచి సెప్టెంబరు 15వ తేదీ వరకు నాలుగు విడతలుగా దేశవ్యాప్తంగా ఉద్యమించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు కార్మికులకు అవగాహన కార్యాక్రమాలు చేపడుతామని తెలిపారు. ఒకటో విడతలో జూలై 24 నుంచి 31 వరకు పిట్ సమావేశాలు, గేట్ మీటింగ్‌ల ద్వారా కార్మికులను చైతన్యపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెండో విడతలో ఆగస్టు 5 నుంచి 14 వరకు జన్ సంపర్క్ అభియాన్, ప్రజలు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. మూడో విడతలో ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 5 వరకు జీఎం కార్యాలయాల ఎదుట, కార్మిక వాడల్లో ప్రజా సమావేశాలు, నాలుగో విడతలో సెప్టెంబరు 15న జీఎం కార్యాలయాల ఎదుట మహాధర్నా, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులకు మెమోరాండం అందజేస్తామని ఆయన తలిపారు. బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 23న అన్ని గనులు, ఓసీపీల వద్ద జెండాలు ఎగురవేసి, కార్మికవాడల్లో బైక్ ర్యాలీలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, మిట్టపల్లి మొగిలి, కుమ్మరి చంద్రశేఖర్, బుర్ర అరుణ్‌గౌడ్, చల్ల ప్రశాంత్, శేఖర్ యాదవ్, నీరటి సురేష్, బొలిశెట్టి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్సెంటివ్స్‌పై సమీక్ష

శ్రీరాంపూర్, జూలై 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా ఉద్యోగుల ఇన్సెంటివ్స్‌పై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ అధ్యక్షతన గుర్తింపు సంఘం నాయకులతో మాట్లాడారు. ఉద్యోగులకు సంబంధించిన ఇన్సెంటివ్స్‌పై వివరించారు. ఖరారు చేసినవిధంగా ఉద్యోగులకు ఇన్సెంటివ్స్ ఇస్తామని, దీనిపై అనుమానాలు ఉండకూడదని సూచించారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఏఐటీయూసీ నాయకులు మోత్కూరి కొమురయ్య, కొట్టె కిషన్‌రావు, బద్రి బుచ్చయ్య, నల్లపు సత్తయ్య, శంకర్, సదానందం, శ్రీనివాస్, సంతోష్, బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

వెంటిలేషన్ సమస్య పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అధికారులు ఆర్‌కే 7 గనిలో వెంటిలేషన్ సమస్యను పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. ఆర్‌కే 7 గని సోమవారం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. సౌత్ 2ఏ సీమ్‌లో వెంటిలేషన్ సమస్య ఉందని, హ్యాండ్ గ్లౌసెస్ ఇవ్వడం లేదని, సరిపడా ఎలక్ట్రీషియన్లు, హెల్పర్లు లేరని పలువురు తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరగా, మేనేజర్ హామీ ఇచ్చినట్లు బాజీసైదా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి మారపెల్లి సారయ్య, అసిస్టెంట్ సెక్రటరీ నామని సదానందం, మైనింగ్ స్టాఫ్ నాయకులు చంద్రశేఖర్, రాజశేఖర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

మందమర్రిటౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సీఎండీ బలరాంను సోమవారం సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) వెంకన్న హైద్రాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకన్న సీఎండీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంస్థ ప్రగతిలో ముందుండేలా కృషి చేయాలని సీఎండీ సూచించారు.

దరఖాస్తులు పరిష్కరించాలి

రెబ్బెన, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు సంక్షేమ దరఖాస్తులు జాప్యం లేకుండా త్వరగా పరిష్కరించాలని డీవైపీఎం ఎస్వీ రాజేశ్వర్‌రావు అన్నారు. జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ దరఖాస్తులపై వాకాబు చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అన్ని విభాగల సిబ్బందితో అడిగి వివరాలు తెసుకున్నారు. సమస్యలు పరిష్కారిస్తామని తెలిపారు. సమావేశంలో సీనియర్ పర్సనల్ అధికారులు ఎం.శ్రీనివాస్, డి.ప్రశాంత్, సంక్షేమ అధికారి రజినికుమార్, జూనియర్ అసిస్టెంటు బాబా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



బాధ్యతలు తీసుకుంటున్న శ్రీనివాసరావు

బెల్లంపల్లి, జూలై21 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ కోసం అందరి సహకారంతో ప్రత్యేక చర్యలు చేపడుతానని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో ఎస్‌హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్న నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. ఎక్కడైన ఏదైన సమస్య ఉంటే డయల్ 100కు గాని, పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు. బజారు ఏరియాలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా తగు చర్యలు తీసుకుంటానన్నారు. వాహనదారులు రహదారులపై పార్కింగ్ చేయరాదని సూచించారు.

లయన్స్‌క్లబ్ కమిటీ నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్‌సభ్యులు

చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని విశ్వకర్మ భవన్‌లో సోమవారం చెన్నూరు లయన్స్‌క్లబ్ నూతన కమిటీని నియామకం చేశారు. 320 జిల్లా రెండవ ఉప గవర్నర్ లయన్ బద్రేశం ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. చెన్నూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా జాడి తిరుపతి, కార్యదర్శిగా సొడం శ్రీనివాస్, కోశాధికారిగా నిమ్మల సాగర్, మొదటి ఉపాధ్యక్షుడిగా నాగరాజుగౌడ్, రెండవ ఉపాధ్యక్షులుగా మాదాసు కిష్టయ్య, అడ్మినిస్ట్రేటర్‌గా మల్లికార్జున్‌రెడ్డి, మెంబర్ షిప్‌గా ఉప్పుల సతీష్, కోఆర్డినేటర్‌గా జాడి శేఖర్, సర్వీస్ చైర్‌పర్సన్‌గా బుద్దారపు ప్రకాష్‌బాబు, మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా జక్కుల సత్యనారాయణ, బండారి లక్ష్మణ్, క్లబ్ డైరెక్టర్లుగా కార్తీక్, ప్రతాప్‌సింగ్, నాగరథు, పోచన్నలను నియామకం చేశారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

కాలినడకన బుగ్గకు బయలు దేరిన భక్తులు

గోదావరినీటితో శివలింగానికి అభిషేకం



గోదావరినీటితో కాలినడకన బుగ్గ దేవాలయానికి బయలు దేరిన భక్తులు

కాసిపేట,జూలై21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి పవిత్రమాసం శ్రావణ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో బుగ్గదేవాలయంలోని శివలింగానికి దేవాపూర్‌కు చెందినభక్తులు సోమవారం గోదావరినీటితో అభిషేకించారు. ఆదివారం గోదావరినీటి కోసం దేవాపూర్ నుంచి మంచిర్యాలకు బయలు దేరి వెళ్లిన భక్తులు సోమవారం ఉదయం గోదావరినీటిని కావడి సహాయంతో కాలినడకన బుగ్గకు బయలు దేరారు. శివలింగానికి గోదావరినీటితో అభిసేకించిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో ప్రజలు అనారోగ్యాల భారిన పడకుండా సుఖ సంతోషాలతో ఉండే విధంగా దేవుడు చల్లంగా చూడాలని కోరుతూ పూజలు చేశామన్నారు.

బుగ్గదేవాలయంలో అన్నదానం

బెల్లంపల్లి, జూలై21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాలగ్రామ పంచాయతీ పరిధిలో గల బుగ్గ రాజరాజేశ్వర దేవాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సతీష్ శర్మ స్రవంతి దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మాసాడి శ్రీదేవి, డైరెక్టర్ బాల క్రిష్ణ, శ్రీహరి, చంద్రయ్య, రాయమల్లు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు భరోసా

అందుబాటులోకి బీమా పథకం

విధి నిర్వహణలో మృతి చెందితే రూ.కోటి పరిహారం

తీవ్రంగా గాయపడితే రూ.80లక్షలు

సహజమరణం చెందితే రూ.10లక్షలు

ఐదువేల మంది ఉద్యోగులకు లబ్ధి

ఎస్‌బీఐ, యూబీఐలతో ఒప్పందం



మంచిర్యాలక్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగమంటే ప్రాణంతో చెలగాటమే. ప్రమాదం ఎప్పుడు ఎక్కడి నుంచి ముంచుకువస్తుందో తెలియదు. నిత్యం ప్రమాదం అంచునా ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు బీమా అమలులోకి వచ్చింది. నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) సీఎండీ కరుణాటి వరుణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం కల్పించారు.

రూ. కోటి పరిహారం...

గతంలో విద్యుత్ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించిన తీవ్రంగా గాయపడిన సంస్థ అందించే పరిహారం వారు వ్యక్తిగతంగా చేసుకున్న బీమా పాలసీల ద్వారా పరిహారం మాత్రమే అందేది. ఇది ఆశించినంత మేరకు ఉండేది కాదు. ఈ బీమా సౌకర్యం వల్ల విధి నిర్వహ ణలో విద్యుత్ ఉద్యోగి మరణిస్తే (ఏఐ) రూ. కోటి వరకు పరిహారం కుటుంబానికి లబ్ది చేకూరుస్తుంది.

అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కదలాడని స్థితిలో (పీటీడీ) ఉన్న ఉద్యోగులకు సైతం రూ. కోటి వరకు పరిహారం అందేలా ఏర్పాట్లు చేశారు. శాశ్వత అంగవైకల్యం (పీపీడీ) కలిగిన వారికి రూ. 80లక్షల పరిహారం వరకు అందుతుంది. ఉద్యోగి సహజమరణం చెందితే రూ. 10లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుంది.

ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఈ మేరకు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూని యన్ బ్యాంక్(యూబీఐ)తో ఒప్పం దాలు కుదుర్చుకున్నారు. ఎస్‌బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్య పరమైన సహాయంలోను రుణాలు బ్యాంకులు అందించనున్నాయి.

ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండానే...

బీమా పొందాలంటే ప్రత్యేకంగా పాలసీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ప్రతీ నెల వేతనం జమ చేస్తే చాలు బీమాను వర్తింపచేస్తున్నారు. విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండా పథకాన్ని తీసుకొచ్చారు.

నిబంధనలు...

ఉద్యోగి వేతనం నెలకు 25 వేలకు పైగా ఉంటేచాలు. ఒప్పందం చేసుకున్న బ్యాంకుల్లో ప్రతీ నెల జీతం జమ కావడమే ఈ బీమాకు అర్హత. ప్రారంభంలో మొదటి నెల 1న జీతం జమ చేస్తూ మరుసటి నెల 1 నుంచి బీమా వర్తిస్తుంది. మూడు నెలల్లో ఒక సారైన డబ్బులు డ్రా చేసుకోవాలి. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పని చేసే అటెండర్, వాచ్‌మెన్ మొదలుకొని ఎస్‌ఈ వరకు బీమా వర్తిస్తుంది. ఈ బీమా పథకం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాలకు గాను 13,287 మంది ఉద్యోగులకు వర్తించగా వీరిలో ఉద్యోగులు 9,821 కాగా ఆర్టిజన్ కార్మికులు 3,466 మంది బీమాపథకంలో ఎస్‌బీఐలో 11287మంది కాగా యూబీఐలో 2వేల మంది ఉద్యోగులు నమోదు అయ్యారు. ఈ పథకం కింద మంచిర్యాల జిల్లాలో సుమారు 500 మందికిపైగా ఉద్యోగులు లబ్ది పొందుతున్నారు.

విద్యుత్ ఉద్యోగులకు మంచి భరోసా

ఏడీ వేణుగోపాల్



గతంలో డిపార్ట్‌మెంట్ పరంగా లేదా సొంతంగా చేసుకున్న బీమా పథకం ద్వారా మాత్రమే లబ్ది పొందేది. ఈ పథకం ద్వారా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సుమారు 500 మందికిపైగా ఉద్యోగులు లబ్ది పొందనున్నారు.

ప్రతీ ఒక్కరు అడవులను సంరక్షించాలి



మొక్కలకు నీరు పోస్తున్న ఎఫ్ఆర్‌వో, మాజీ జెడ్పీటీసీ

వేమనపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :ప్రతీ ఒక్కరు అడవులను సంరక్షించాలని నీల్వాయి ఎఫ్ఆర్‌వో హఫీజొద్దీన్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం కల్మలపేట గ్రామంలో మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి నీరు పోసి వాటిని సంరక్షించాలన్నారు. చెట్లను ఎవరు నరకవద్దని, అడవులు ఉంటేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, లింగాగౌడ్, రాజన్న, సత్యనారాయణ, రమేష్, పున్నం, శంకర్, లచ్చన్న, తిరుపతి, పోచం, శ్రీను, తిరుపతి, శంకర్, గణేష్, శ్రీశైలం, మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో గని కార్మికులది కీలక పాత్ర...

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల గుండెల్లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం శాశ్వతంగా ఉంటుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. టీబీజీకేఎస్ బాధ్యతలు తీసుకున్న ఈశ్వర్ సోమవారం తొలిసారిగా గోదావరిఖనికి వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు కొప్పుల ఈశ్వర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక మున్సిపల్ చౌరస్తా నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కండేయాలనీలోని ఒక పంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఈశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకమైందన్నారు. సింగరేణి కార్మికులపై కేసీఆర్‌కు అమితమైన ప్రేమ ఉంటుందని చెప్పారు. సింగరేణి సంస్థను జాతీయ కార్మిక సంఘాలు నాశనం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఈశ్వర్ ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ఈశ్వర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు రాజకీయాలను నిర్వహిస్తున్నదని, అనేక నిర్బంధాల మధ్య ఈ సమావేశం నిర్వహించుకోవడం దురదృష్టమన్నారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు వేదింపులకు గురి చేస్తున్నారని, యూనియన్, పార్టీకి సంబంధించిన ఉద్యోగులను అక్రమ బదిలీలు చేస్తున్నారని ఈశ్వర్ ఆరోపించారు. అక్రమ బదిలీలపై త్వరలో కోల్‌బెల్ట్ ప్రాంత మాజీ ఎమ్మెల్యేలతో సీఎండీని కలుస్తామని ఈశ్వర్ చెప్పారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం

చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాసం బహుళ ఏకాదశిని పుర స్కరించుకుని సోమవారం చెన్నూరు పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, గోవింద నామ పారాయణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పారాయణం చేసి అలంకరించారు. అనంతరం ఆషాఢ మాసం సందర్భంగా మెహందీ వేడుకలను నిర్వహించారు. అలాగే రాధాకృష్ణ మందిరంలో కూడా శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పరిహారం చెల్లించేదెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల చివరి విడత రూ. 70 వేల చొప్పున 1180 మందికి ఇప్పటి వరకు చెల్లించలేదు.

-హాజీపూర్ మండలం కొండపల్లి ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యల కారణంగా 59 కుటుంబాలు ప్లాట్లు తీసుకునేందుకు అంగీకరించలేదు. దీంతో అప్పట్లో ఒక్కో కుటుంబానికి రూ. 2.70 లక్షల పరిహారం ప్రకటించారు. అవి కూడా ఇప్పటి వరకు చెల్లించలేదని బాధితులు వాపోతున్నారు.

-ముంపు బాధితుల పిల్లలు 18 ఏళ్లు నిండిన వారికి మేజర్ సన్స్ కింద పరిగణించి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల ప్యాకేజ్ ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బులు కూడా ఇప్పటికీ అందలేదని బాధితులు చెబుతున్నారు. మొత్తంగా దాదాపు రూ. 4 కోట్లమేర పునరావాస బకాయిలు ఉన్నట్లు ప్రజలు తెలిపారు. అయితే పదేళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ముంపు బాధితులను పట్టించుకోకపోవడంతో సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి.

పొరుగు జిల్లాల్లో అందిన పరిహారం...

ఇదిలా ఉండగా 2024 అక్టోబర్ 26న అప్పటి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ చొరవతో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం చెగ్యాం ముంపు బాధితులకు 126 కుటుంబాలకు రూ. 18 కోట్లకు సంబంధించిన చెక్కులను అందజేసినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే తమకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం పట్ల జిల్లా బాధితులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మించింది...రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి ఇప్పటికైనా తమకు పూర్తిస్థాయి పరిహారం అందించాలని ప్రాజెక్టు ముంపు బాధితులు కోరుతున్నారు.

కొండపూర్ రహదారి కష్టాలు తీరేనా..?

నిధులు విడుదలైనా ప్రారంభం కాని పనులు

కాసిపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్, సోమగూడెం ప్రధాన రహదారి కొండాపూర్ యాప వద్ద రహదారి గుంతల మయంగా మారింది. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రజాసంఘాలు, స్థానికులు ఆందోళనలు, నిరసనలు చేపట్టడంతో ఇటీవల డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా 20లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు అయినప్పటికీ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. వర్షం కురిసినప్పుడు ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్దిపాటి వర్షం పడడంతోనే రహదారిపై నీటి కుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతోంది. తప్పని పరిస్థితుల్లో ఆ దారి గుండా ప్రయాణించినా కొందరు గుంతల్లో అదుపు తప్పి పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు సమస్యను గుర్తించి వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కొండాపూర్ యాప వద్ద నీటిగుంతలో నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

ఆదివాసీ గిరిజన సంఘం నాయకుల నిరసన

జీవో 49 రద్దు చేయాలని ఆందోళనలు



మంచిర్యాలలో ఆందోళన చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 49ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్‌చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి జీవో కాపీలను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలను, పేదలను లక్ష్యంగా చేసుకుని వారి జీవితాలతో చెలగాట మాడుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం జీవో నెంబరు 49 తీసుకువచ్చి మోదీ ఎజెండాను అమలు చేస్తున్నారన్నారు. దీని వల్ల ఆదివాసీలు, పేదలు వారు నివసిస్తున్న 339 గ్రామాలను 3 లక్షల ఎకరాల భూమిని కోల్పోతున్నారన్నారు. అడవులను, భూములను కార్పోరేట్ సంస్థలకు అప్పగించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు, పేదలపై యుద్ధం ప్రకటిస్తున్నాయని ఇది సరైంది కాదన్నారు. మంచిర్యాల జిల్లాలో కవ్వాల్ టైగర్ జోన్, ప్రాణహిత కృష్ణ జింకల ప్రాంతం, శివ్వారం మొసళ్ల అభయార్యణం కేంద్రాల పేరుతో సగం జిల్లాను ఖాళీ చేయించే కుట్రలను గత, ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో ఫారెస్టు అధికారులు వందల మంది ఆదివాసీలు, పేదలపై అక్రమ కేసులు పెట్టడం, జైళ్లకు పంపారని, పట్టాలున్న భూములను కూడా బలవంతంగా లాక్కుంటున్నారన్నారు. వెంటనే ఈ జీవోను రద్దు చేయాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోమాస ప్రకాష్, దుంపల రంజిత్‌కుమార్, దూలం శ్రీనివాస్, రాములు, శ్రీకాంత్, రత్నవేణి, నిర్మల, రాంచరణ్, రాజ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

చెన్నూరు : ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు 49ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం చెన్నూరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేయడంతో పాటు జీవో 49 కాపీలను దహనం చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్య దర్శి ఎర్మ పున్నం, నాయకులు మహేష్, ఉమారాణి, సరిత, శారద పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.

కాసిపేట: 49 జీవోను రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ తుడుం దెబ్బ ఇచ్చిన పిలుపు మేరకు మండలంలో బందు ప్రశాంతంగా జరిగింది. తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడె జంగు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 49 జీవో ద్వారా ఆదివాసీలను అడవికిదూరం చేస్తున్నా రని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ తుడుం దెబ్బ సంఘాల నాయకులు మడావి వెంకటేశ్, పెంద్రం శంకర్, హన్మంతు పాల్గొన్నారు.

దండేపల్లి: జీవో 49ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమ వారం దండేపల్లిలో గిరిజన సంఘాల నాయకులు రాస్తారోకో చేపట్టారు. జిల్లా బంద్ పిలుపులో భాగంగా మండలంలోని బంద్ విజయవంతం చేశారు. ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్ మాట్లాడారు. ఎస్సై తాహసీనొద్దీన్ అక్కడికి చేరుకోని ఆందోళన విరమిపజేసారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, పాల్గొన్నారు.

నెన్నెల : అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం జీవో నెం. 49 ప్రతులను దహనం చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి మాట్లాడారు. జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పట్టు గంగయ్య, కె. శ్రీను, రవి, మల్లేష్, శంకర్, పాల్గొన్నారు.

జన్నారం: జీవో నెంబర్ 49ని రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు రాయిసిడం, ఖాళీ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుజీవో నెంబర్ 49ని రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ జన్నారం మండలంలో చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బందుకు ఇచ్చిన పిలుపు మేరకు అన్నివర్గాల వారు సంపూర్ణ మద్దతునివ్వడం హర్షనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కుడిమేత ధర్మ, తొడసం గంగు, మర్సకోల వసంతు, ఆనంద్‌రావు, దురువా యశ్వంత్, లక్ష్మణ్, బొజ్జు, శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.



జన్నారంలో మాట్లాడుతున్న రాయి సిడం నాయకులు



దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు



చెన్నూర్‌లో జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

పట్టాలపై ప్రాణాలు...

- రైలు ఢీకొని కొందరు...ఆత్మహత్యలతో మరికొందరు మృతి
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు



బెల్లంపల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై ప్రమాద మరణాలు, ఆత్మహత్య ఘటనలు తరుచుగా చోటుచేసుకుంటుండంతో ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లాలోని పలు రేల్వే స్టేషన్ల వద్ద కొందరు ప్రమాదవశాత్తు మరికొందరు రైళ్లఢీకొని, ఇంకొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలాగే గుర్తు తెలియని మృతదేహాలు సైతం లభిస్తుండడంతో మిస్టరీగా మిగిలిపోతున్నాయి. జిల్లా పరిధిలో 50కిలో మీటర్లకుపైగా రైల్వే లైన్ ఉంది. నిత్యం ఏదోఒక చోట ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. రైలు ప్రమాదమరణాలకు అనేక కారణాలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో, ప్రేమ విఫలమై, మద్యానికి బానిసై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొన్ని ఘటనల్లో హత్యచేసి రైలుపట్టాలపై మృతదేహాలను పడేస్తున్న ఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2022లో 75మంది రైలు కింద ఆత్మహత్యలు చేసుకోగా 43 మంది ప్రమాదవశాత్తు మరణించారు. అలాగే గుర్తుతెలియని 14 మృతదేహాలు జీఆర్‌పీ పోలీసులకు లభ్యమయ్యాయి. 2023లో రైలు కిందపడి 73 మంది ఆత్మహత్యకు పాల్పడగా ప్రమదావశాత్తు 63 మంది మృత్యువాత పడ్డారు. 19 గుర్తు తెలియని మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2024లో 76 మంది ఆత్మహత్యకు పాల్పడగా ప్రమాదవశాత్తు 55 మంది మృత్యువాత పడగా 11 గుర్తు తెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. 2025 ఏప్రిల్ వరకు 25 మంది ఆత్మహత్యకు పాల్పడగా 18 మంది ప్రమాదవశాత్తు మృతి చెందారు.

అవగాహన కల్పిస్తున్నాం...

రైల్వే ఇన్‌స్పెక్టర్ నరేందర్, బెల్లంపల్లి

రైలుపట్టాలపైకి వెళ్లకుండ తరచు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రైలు పట్టాలపైకి వెళ్లడం రైల్వే చట్టాలకు విరుద్ధం. అందుకు జరిమానతోపాటు జైలు శిక్ష విధించవచ్చు. చాలా మంది ఆత్మహత్య శరణ్యంగా భావించి రైలు పట్టాలపై మృతి చెందుతున్నారు. గుర్తు తెలియని మృతదేహాలకు పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తూ ఎవరు స్పందించలేకపోతే అంత్యక్రియలు నిర్వహిస్తున్నాం.



24న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మోడల్ స్పోర్ట్స్ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్-14, 15, 18, 20 బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఆటగాళ్లు హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఆగస్టు 3, 4 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా కెరమెరిలో 36.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దహెగాంలో 21.0, రెబ్బెన మండలంలో 20.0, వాంకిడిలో 15.5, ఆసిఫాబాద్‌లో 7.5, తిర్యాణిలో 6.3, కాగజ్‌నగర్‌లో 3.5, పెంచికలపేటలో 3.5, సిర్పూర్(యు)లో 1.3 లింగాపూర్‌లో 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

కేరళ మాజీ ముఖ్యమంత్రి మృతి పార్టీకి తీరని లోటు

కాగజ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ముంజం ఆనంద్ అన్నారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూశన్న రాజన్న పాల్గొన్నారు.

- ఏటీఎల్‌పై ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ
- పీఎంశ్రీ పాఠశాలలకు అటల్ టింకరింగ్ పథకంలో కేంద్రం నిధులు
- ప్రాజెక్టు ఆధారిత అభ్యాసానికి ప్రాధాన్యం





అవగాహన కల్పిస్తున్న నిపుణులు(ఫైల్)

విద్యార్థులతో ప్రయోగాలకు సిద్ధం

కాగజ్‌నగర్ టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థు ల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంచి భావి శాస్త్రవేత్తలుగా, ఆవిష్కరు లుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఏ ఏడాది అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)లను ఏర్పాటు చేసింది. ఇందు కోసం కుమరం భీం జిల్లా వ్యాప్తంగా పీఎంశ్రీ పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా ఉపాధ్యాయులకు ఈనెల 17, 18 తేదీల్లో శిక్షణ కూడా పూర్తి చేశారు. ఈ విద్యా సంవత్సరంలో లాబ్‌ల ను సద్విని యోగం చేసుకునేందుకు విద్యార్థులకు ప్రయోగ పాఠాలు బోధిం చేందుకు ఉపాధ్యాయులకు జిల్లాలో శిక్షణ కార్యక్ర మాలు ప్రారంభించారు. ఫిజిక్స్, బయాలజీ, గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశారు. రెండు రోజుల శిక్షణలో ప్రత్యక్ష ప్రయోగాల నిర్వహణలో ప్రధానంగా డయోడ్స్, కెపాసిటర్లు, బ్రెడ్ బోర్డును ఉప యోగించి సర్క్యూట్ల తయారీ, డ్రోన్లను ఫోన్‌తో అనుసంధానం చేయడంతో పాటు నమూనా రోబోటిక్స్ లను విడిభాగాలతో తయారు చేయించి ఆపరేట్ చేయి ంచారు. 3డీ ముద్రణ విడిభాగాలతో ముద్రణ పరి కరాన్ని తయారు చేయించి కంప్యూటర్ ద్వారా ఏలా ముద్రించాలో వివరించారు. అంతే కాక కొన్ని బొమ్మల ఆకారపు నమూనా 3డీ ముద్రణలను చేయించారు. ఆయా పరికరాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఏటీఎల్ ద్వారా విద్యార్థులు చిన్న వయస్సు లోనే శాస్త్రవేత ్తలు, ఆవిష్కర్తలుగా ఎదగడానికి అవసరమైన పునదారిని ఏర్పరచాలనే ప్రభుత్వ ధ్యేయం. ఏటీఎల్ ద్వారా ప్రాజెక్టు ఆధారిత అభ్యాసానికి ప్రధాన్యం ఇవ్వనున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 14 పాఠశాలలు పీఎంశ్రీ కింద ఉండగా, జిల్లా కేంద్రంలో నిపుణులతో శిక్షణ ఇచ్చారు. కొత్తగా పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థుల సంఖ్య, ఆయా పాఠశాలల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా 14 పాఠశాలలు పీఎంశ్రీ కింద ఎంపిక య్యాయి. ఈ ల్యాబ్‌లకు రూ. 20 లక్షలు నిధులు మంజూరు కాగా, వీటిలో ఏటా రూ. 2లక్షల చొప్పున ఐదేళ్ల పాటు రూ. 10 లక్షలు మెయింటెనెన్స్ కింద నిధులు మంజూరు చేస్తారని జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ తెలిపారు. ఈ నిధు లతో కంప్యూటర్లు, రోబోటిక్స్ డ్రోన్లు తదితర పరికరాలు పంపిణీ చేస్తారు. ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్ పరికరాలు, టెలిస్కోప్, త్రీడి ప్రింటర్స్ ల్యాప్‌టాప్స్, ఏఐకు సంబంధిత, మెకానిక్, సేఫ్టీ టూల్స్, ఫైర్ పరికరాలు వంటివి ఒక్కో ల్యాబ్‌కు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ ల్యాబ్‌లు సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితంలో పరిశోధనలకు తోడ్పాటుగా నిలుస్తా యని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఏటీఎల్‌లు విద్యార్థులకు నూతన ఆవిష్కరణల రూపకల్పన, పరిశోధన రంగంపై ఆసక్తి కల్పించనున్నాయని తెలియజేస్తున్నారు.

ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు..

- మధుకర్, జిల్లా సైన్స్ అధికారి

అటల్ టింకరింగ్‌కు సంబంధించిన ల్యాబ్‌లు ఏర్పా టు చేసేందుకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందులో భాగంగా ఈనెల 17, 18లో ఉపాధ్యాయు లకు శిక్షణ పొందారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాలపై పూర్తి అవ గాహన పెరుగుతుంది. నూతన ఆవిష్కరణలతో విద్యార్థుల్లో క్రియేటివిటీ పెరుగుతుంది. ఉపాధ్యాయులు కూడా ప్రయోగ పాఠాలు ఆసక్తితో బోధించేందుకు ఉప యోగకరం.

టైగర్ రిజర్వు జీవోకు బ్రేక్

గిరిజనుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

కాగజ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీ గ్రామాల ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్న జీవో 49ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తరులు జారీ చేసింది. మహారాష్ట్రలోని తడోబా, మంచిర్యాల జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వుకు మధ్య అనుసంధానంగా ఉన్న కాగజ్‌నగర్ డివిజన్‌లోని కడంబా అటవీ ప్రాంతాన్ని కవ్వాల్ టైగర్ రిజర్వులో భాగంగా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ని విడుదల చేసింది. ఈ జీవో ఆధారంగా కుమరం భీం జిల్లాలో 71 బ్లాక్‌లను గుర్తించారు. తరతరాలుగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆదివాసి గ్రామాల ప్రజలు కొంత కాలంగా తీవ్ర ఆందోళనకు గురి అయ్యారు. ఈ క్రమంలో జీవోను రద్దు చేయాలని డిమాండు చేస్తూ ఆర్డీవో కార్యాలయాలు, కలెక్టర్ ఎదుట ధర్నాలు నిర్వహించారు. అంతేకాదు ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ దాక టైగర్ రిజర్వు ప్రతిపాదనకు వ్యతిరేకంగా పాదయాత్ర నిర్వహించారు. మొత్తంగా ఈ పర్యవసనాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పట్ల వ్యతిరేకత రావటంతో అటు అధికార పార్టీ నేతలు కూడా ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇవడంతో ఆదివాసీలు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



తిర్యాణిలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్/తిర్యాణి/వాంకిడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు తిరుపతి, వంశీలు కోరారు. జిల్లా కేంద్రంతో పాటు తిర్యాణిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకు రావాలని చెప్పారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈవో డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలని బంద్ తలపెట్టినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు షేక్ సమీర్, అయ్యూబ్‌ఖాన్, భరత్, అవినాష్, నితిన్, మధుకర్, సుశాంత్, ప్రణయ్, మహేష్, అఖిల్, భీమయ్య, సన్నీ, వంశీ, అన్వేష్, రామ్, సుమర్, ధనుష్, పవన్, విజయ్, కుమార్, శ్రీకాంత్, సాయినాథ్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

సరపడా యూరియా అందించాలి



పీఏసీఎస్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న నాయకులు

దహెగాం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు సరిపడా యూరియా అందించాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందంర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు యూరియా అందించక పోతే ఆందోళన చేపడుతామన్నారు. అన్నదాతలు పనులు మానుకొని యూరియా కోసం కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. రైతులకు సరిపడా యూరియా అందజేస్తామని పీఏసీఎస్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, మల్లేష్, బాపు, ప్రకాష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ పెర్కగూడ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 25న ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. స్థానికంగా సోమవారం జాబ్ మేళాకు సంబం ధించి కరప్రాలను విడుదల చేశారు. జాబ్ మేళాకు 50కి పైగా వివిధ కంపెనీలు రానున్నాయని చెప్పారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాం, చరణ్, తిరుపతి, గంగారాం, లింగు, జుగాదిరావు, జాలీంషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత



పోలీసులు పట్టుకున్న నిందితులు

కెరమెరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కెరమెరి కొఠారి గ్రామ శివారులో సోమవారం గంజాయి పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై మధూకర్ తెలిపారు. తమకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు కొఠారి గ్రామంలో తనిఖీలు నిర్వహించామని ఎస్సై చెప్పారు. ఆసిఫాబాద్‌కు చెందిన షేక్ రియాజ్, కొటారికి చెందిన బిల్లాగి రావు వద్ద 146 గ్రాముల గంజాయి లభించినట్టు తెలిపారు. ఈ మేరకు వీరి వద్ద ఉన్న ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సదస్సును విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చేయూత పెన్షన్‌దారుల సదస్సును విజయవంతం చేయాలని వికలాంగుల పోరాట హక్కుల సమితి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి పెద్దపల్లి సత్యనారాయణ, జాతీయ నాయకుడు రేగుంట కేశరావు మాదిగ తెలిపారు. స్థానికంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 26న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కాగజ్‌నగర్‌లోని ఓ పంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న చేయూత సదస్సుకు హాజరవుతు న్నారని చెప్పారు. ఈ సదస్సు అధిక సంఖ్యలో హాజరైన విజయ వంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు మంత్రి మల్లేష్, శ్రీనివాస్, కంబాల రమేశ్, బన్నమూర్తి, సీనియర్ నాయకుడు ఎం.డి.ఖయ్యూం, గోలేం వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్, రెడ్డి సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆదివాసీలు ఆందోళన చెందొద్దు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాసులు జీవో 49పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది ఆగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సోమవారం ఆయనను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జీవో 49ని రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు. జీవో విడుదల అనంతరం జిల్లాలో పరిస్థితులలపై ఆయనకు కూలంకుషంగా వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో 49 అమలు కాకుండా అన్ని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. గత నెల ఉట్నూర్‌లో ఆదివాసీలతో సమావేశమైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జీవో వచ్చిన తరువాత ఆదివాసీల ఆవేదన, ఆందోళన గురించి ముఖ్యమంత్రికి వివరించారని అన్నారు. అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, పంచాయతీ రాజ్ మంత్రి దనసరి సీతక్కతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలుసుకొని ఆదివాసీలకు అన్యాయం చేసే జీవోను నిలిపి వేయాలని నిర్ణయించారన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జీవో పూర్తిగా రద్దయ్యే విధంగా చూస్తామని జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా ఆదివాసీలకు అండగా ఉంటుందని తెలిపారు.



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు

బంద్ సంపూర్ణం

- మూసిఉంచిన దుకాణాలు
- నిర్మానుష్యంగా రహదారులు
- పోలీసుల పటిష్ట బందోబస్తు



కాగజ్‌నగర్‌లో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు



ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించిన ఆదివాసీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జీవో 49ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపు సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. పోలీసులు బంద్‌కు సంబంధించి పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుండే వాణిజ్య సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనగా ఆర్టీసీ బస్సులు అరకొరగా నడిచాయి. బస్టాండు ఎదుట ధర్నా నిర్వహించి బస్సులు బయటికి వెళ్లకుండా చూశారు. అనంతరం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బంద్‌తో రోడ్లన్ని నిర్మానుష్యంగా మారాయి. బంద్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో పటిష్ట బందో బస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో సీఐ రవీందర్ బందో బస్తు ఏర్పాట్లను పరిశీలించారు. రాత్రి నుంచి పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా కేంద్రానికి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలి రాకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కోవవిజయ్, మాలశ్రీ, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు..

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): గిరిజన సంఘాలిచ్చిన పిలుపు మేరకు కాగజ్‌నగర్‌లో బంద్ సక్సెస్ అయింది. ఈ సందర్భంగా పట్టణ వ్యాపార సంస్థలన్నీ కూడా స్వచ్ఛందగా మూసివేసి బంద్‌కు సహకరించాయి. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయిహరీష్ బాబు పట్టణంలో తిరిగారు. వివిధ సంఘాల నాయకులు కూడా ఈ బంద్‌కు పూర్తిగా సహకరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి శివాజీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈకార్యక్రమంలో ప్రసాద్, శంకర్, భీమేష్, ఆపూరావు, పనేందర్, సాగర్, రూపేష్, సుధాకర్, బీజేపీ నాయకులు రామన్న, అంకులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ సంఘాలు తలపెట్టిన బంద్ విజయవంతం అయింది. ఈ కార్యక్రమంలో నాయకులు సకారాం, తిరుపతి, శంకర్, రాజు, వెంకటేష్, మోహన్, రాజారాం, అమృత, తిరుపతి, వశీఖాన్, కిషన్, గోపాల్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాలు తలపెట్టిన బంద్ మండలంలో విజయవంతం అయింది. ఈ సందర్భంగా దుకాణాలు స్వచ్ఛందగా బంద్ పాటించాయి. కార్యక్రమంలో నాయకు లు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యం లో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి శివాజీ విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మధుకర్, అశోక్, సకారాం, మల్లేష్, భుజంగరావు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, బీజేపీ నాయకులు లావణ్య, షేక్‌చాంద్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో భారీ బందో బస్తు నిర్వహించారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకు వచ్చిన జీవో.49ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాలు తుడుం దెబ్బ ఇచిచన బంద్ పిలుపు సోమవారం విజయవంతం అయింది. ఉదయకే వాణిజ్య, వ్యాపార సముదాయాలు మూసి ఉంచారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్ సంపూర్ణం అయింది. ఈ సందర్భంగా దుకాణాలను బంద్ చేయించి కుమరం భీం విగ్రహం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో మూసి ఉన్న దుకాణాలు

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ మండలంలో సంపూర్ణంగా జరిగింది. ఆయా కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కుమ్ర భీమ్‌రావు, ఉపాధ్యక్షుడు ఆత్రం దౌలత్‌రావు నాయకులు పెందోర్ నాగోరావు, మడావి శంకర్, లచ్చన్న, నగేష్, సేడ్మకి దౌలత్‌రావు, ఆత్రం నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ఇచ్చిన పిలుపులో భాగంగా మండల కేంద్రంలో సోమవారం బంద్ సంపూర్ణంగా కొనసాగింది. వాణిజ్య, వ్యాపార సముదాయాలు బంద్‌ను స్వచ్ఛందంగా పాటించి పూర్తి మద్దతు పలికారు. అవాంఛనీయ సంఘటనలు జర్గకుండా సీఐ వెల్పుల రమేష్, ఎస్సై రవికుమార్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.



చింతలమానేపల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు



పెంచికలపేటలో..



సిర్పూర్(టి)లో మూసి ఉన్న దుకాణాలు